www.prajasakti.com
ప్రజాశక్తి
బుధవారం 15 మార్చి 2023
5
తిరుపతి



విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: స్థానిక తిరుపతిలోని వరదరాజ నగర్ లోని యానాది కాలనీ లోని పేద పిల్లలకు తిరుపతి లయన్స్ క్లబ్ అధ్యక్షుడు భీమినేని మునికృష్ణ నాయుడు ఆధ్వర్యంలో పిల్లలకు ఉచితంగా విద్యా సామగ్రి, ఆరోగ్య సంరక్షణకు టూత్ పేస్టులు, బ్రష్లు, సోపులు, 10 వేల రూపాయలు విలువ చేయు వస్తువులు క్లబ్ తరఫున ఉచితంగా వితరణ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతి పట్టణంలో ఇక్కడ ఉన్నటువంటి పేద పిల్లలను వి సపోర్ట్ చారిటబుల్ ట్రస్టు చైర్మన్ తహసున్నీసా బేగం పిల్లలకు కావాల్సిన మౌలిక వస్తువులు కల్పిస్తూ వారికి ఉచితంగా విద్యను అందిస్తున్నారన్నారు. ఈ సందర్భంగా క్లబ్ తరపున ఆమె చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ నరేంద్ర కుమార్ విచ్చేసి లయన్స్ క్లబ్ చేస్తున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. వి సపోర్ట్ ట్రస్ట్ చైర్మన్ తహసున్నీసా బేగం మాట్లాడుతూ సేవలోనే సంతృప్తి ఉందన్నారు. క్లబ్ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ అదనపు కార్యదర్శి డాక్టర్ కె .రాజేంద్రప్రసాద్, కార్యదర్శి చిత్రమోహన్, ట్రెజరర్ ముబారక్ భాష తదితరులు పాల్గొన్నారు.

మార్క్స్ సిద్ధాంతం సమాజానికి శ్రేయస్కరం : సిపిఎం



చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో: మార్క్స్ మహోపాధ్యాయ సిద్ధాంతం సమాజానికి శ్రేయస్కరమని సిపిఎం జిల్లా కార్యదర్శి వి.నాగరాజు అన్నారు. నేటితరం మార్క్సిస్టు కార్యకర్తలు ఆయన సిద్ధాంతాన్ని అవగాహన చేసుకుని పీడిత తాడిత ప్రజల విముక్తి కోసం ఉద్యమాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. యశోదానగర్‌లోని ఎంబి భవన్‌లో 140వ మార్క్స్ వర్ధంతి సభను నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. వి.నాగరాజు మాట్లాడుతూ మానవజాతి కష్టాల నుంచి విముక్తి పొందేందుకు 'క్యాపిటల్' గ్రంథం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ఆయన నమ్మిన సిద్ధాంతాన్ని చైనా, క్యూబా, ఉత్తరకొరియా, వియత్నాంలో అమలు చేయడం ద్వారా అక్కడి ప్రజలు అభివృద్ధి చెందుతున్నారన్నారు. వెనకబడిన దేశాలైనా మావో ఈ సిద్ధాంతాన్ని అనుసరించి ప్రజల శ్రేయస్సుకు పాటుపడ్డారన్నారు. ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా చైనా ఎదుగుతోందన్నారు. ఈ సభలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కందారపు మురళి, నగర కార్యదర్శి టి.సుబ్రమణ్యం, నాయకులు జీవిఎస్ మణ్యం, వేణు, మునిరాజ, వివస్ మణ్యం తదితరులు పాల్గొన్నారు.

17న మహిళా వర్సిటీలో పీహెచ్‌డీ స్పాట్ అడ్మిషన్లు

ప్రజాశక్తి - క్యాంపస్: శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో పిహెచ్డి స్పాట్ అడ్మిషన్ల కొరకు దరఖాస్తులను 17 న ఆహ్వానిస్తోందని కులసచివులు ఆచార్య రజని ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయానికి న్యాక్ ఏం గ్రేడ్, అంతర్జాతీయ, జాతీయ స్థాయిలో స్వర్ణ పథకం సాధించి ఖ్యాతి గడించిందన్నారు. విద్యార్థులకు, మహిళలకు సాంకేతికాభివృద్ధి కొరకు అధునాతన పరికరాలు కలిగిన ప్రయోగశాలలు, సరికొత్త ఆవిష్కరణలు పొందడానికి క్రియాశీలక కేంద్రాలను కలిగి వుంది, విద్యార్థినులు ఆన్ క్యాంపస్ డ్రైవ్ ద్వారా ఉద్యోగ అవకాశాలు మెండుగా పొందుతున్నారు. విద్యార్థినులు భద్రత కోసం మహిళా రక్షణ కేంద్రం, మహిళలకు విద్యార్థినులకు హస్త కళాఉత్పత్తుల శిక్షణ కొరకు శిక్షణా కేంద్రం కలదు. పిహెచ్డి విభాగంలో వివిధ కోర్సులకు స్పాట్ అడ్మిషన్ జరుపబడునని, ఎపిఆర్ సెట్ - 2022 లో ర్యాంకులు పొందిన విద్యార్థినులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అడ్మిషన్ డైరెక్టర్ ఆచార్య సువర్ణలతా దేవి తెలియజేశారు. వివరాల కొరకు మహిళా వర్సిటీ వెబ్ సైట్‌ను సందర్శించగలరని తెలిపారు.

మాస్టర్ ప్లాన్ రోడ్లను వేగవంతం చేయాలి : కమిషనర్



రహదారులను పరిశీలిస్తున్న కమిషనర్

తిరుపతి టౌన్ : నగరంలో రూపుదిద్దుకుంటున్న మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులను వేగవంతం చేయాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ అనుపమ అంజలి అధికారులకు ఆదేశాలు జారీ చేసారు. తిరుపతిలో మాస్టర్ ప్లాన్ రోడ్ల పనులు జరుగుతున్న కొర్లగుంట మెయిన్ రోడ్, చింతలచేను, హీరోహోండా షోరూమ్, అంకురా హాస్పిటల్ ప్రదేశాలను మంగళవారం కమిషనర్ అనుపమ పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులతో మాట్లాడుతూ తిరుపతి నగరంలో రోజు రోజుకి పెరుగుతున్న జనాభాకి సౌకర్యవంతంగా వుండేలా, అధిక సమయం ట్రాఫిక్ జామ్ తో ఇబ్బందులు పడే వాహనదారులకు అనువుగా వుండేలా మాస్టర్ ప్లాన్ రోడ్లను నిర్మించడం జరుగుతున్న దన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లలో బిటి రోడ్లును శరవేగంగా వేయించాలని, కోర్ట్ కేసులు వున్న వాటిపై ప్రత్యేక దష్టి సారించి వాటి పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. పనులు వేగవంతం చేసేందుకు ఇంజనీరింగ్ అధికారులు, ప్లానింగ్ అధికారులు సమన్వయంతో కలిసి పని చేయాలన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్లు పూర్తి అయితే నగరంలో ట్రాఫిక్ కష్టాలు చాలా వరకు తీరుతాయని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. అదనపు కమిషనర్ సునీత, సూపరింటెండెంట్ ఇంజనీర్ మోహన్, మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, డిప్యూటీ సిటీ ప్లానర్ దేవికుమారి, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు బాల సుబ్రహ్మణ్యం, షణ్ముగం, డిఈలు సంజీవ్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

ఏప్రిల్‌లో ఇండోర్ స్టేడియం ప్రారంభించాలి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: తిరుపతి ఇందిరా మైదానం పక్కన నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియం పనులను వేగవంతం చేసి వచ్చే నెలలోపు ప్రారంభించేలా పనులు నిర్వహించాలని తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్, తిరుపతి స్మార్ట్ సిటీ ఎం.డి అనుపమ అంజలి ఆదేశాలు జారీ చేసారు. ఇండోర్ స్టేడియం పనులను మంగళవారం కమిషనర్ అనుపమ పరిశీలిస్తూ పనులు ఆలస్యం కాకుండ అధికారులు శ్రద్ద తీసుకొని పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. పనులు ఆలస్యం చేస్తే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని కమిషనర్ హెచ్చరికలు జారీ చేసారు. ఏడు కోట్లతో స్మార్ట్ సిటీ నిధులతో నిర్మిస్తున్న ఇండోర్ స్టేడియంలో షటిల్, కబాడి, బాస్కెట్ బాల్, జిమ్నాయిజం కోర్టులు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఇండోర్ స్టేడియం అందుబాటులోకి వస్తే తిరుపతి క్రీడాకారులకు సౌకర్యవంతంగా వుంటుందని కమిషనర్ అనుపమ అంజలి తెలిపారు. ఆయన వెంట మునిసిపల్ ఇంజనీర్ చంద్రశేఖర్, ఏయికామ్ సంస్థ భాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎంఎల్‌సి ఎన్నికల నిర్వహణలో..

ఎన్నికల కమిషన్ వైఫల్యం : అఖిలపక్షం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

పట్టాభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి ఎన్నికలకు అక్రమాలకు నిలయంగా మారిన తిరుపతి నగరంలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీపోలింగ్ జరపాలని సిపిఎం, సిపిఐ, తెలుగు దేశం, జనసేన, కాంగ్రెస్, ఆర్‌పిఐ పార్టీలు డిమాండు చేశాయి. స్థానిక బైరాగిపట్టెడలోని సిపిఐ కార్యాలయంలో అన్ని రాజకీయ పార్టీలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ ఎంఎల్‌సి ఎన్నికలను సజావుగా జరపడంలో రాష్ట్ర ఎన్నికల సంఘం విఫలం అయిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కేంద్రాల్లో ఎంఎల్‌సి ఎన్నికలు రీ పోలింగ్ జరపాలని డిమాండు చేశారు. రాజకీయ బకాసురిడిగా సిఎం జగన్ మారాడని, మండలి ఎన్నికలను ఏ సిఎం ఇంతగా దిగజార్చలేదన్నారు. అన్ని ఎన్నికల్లో వైసిపి గెలవాలని సిఎం జగన్ దుర్మార్గంగా వ్యవహరిస్తున్నారని, అన్ని వ్యవస్థలను నాశనం చేసినట్లు మండలి ఎన్నికలనూ సిఎం జగన్ భ్రష్టు పట్టించారని ధ్వజమెత్తారు. దొంగ ఓట్లు, డబ్బులు పంపిణీతో వైసిపి ప్రభుత్వం ఎంఎల్‌సి ఎన్నికను అపహస్యం చేసిందన్నారు. దొంగోట్లు, డబ్బుల పంపిణీతో వైసిపి గెలిచినా ఎవ్వరు గుర్తించరని తెలిపారు. డిజిపి రాజేంద్రనాథ్‌రెడ్డి సిఎంకి పెద్ద జీతగాడుగా వ్యవహరిస్తున్నారని, డిజిపిగా రాజేంద్రనాథ్ వచ్చాక పోలీసులు వైసిపికి ఊడిగం చేస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యాన్ని కూనీ చేస్తున్న వైసిపి ప్రభుత్వాన్ని ఓడించేందుకు ప్రజలను చైతన్యం చేస్తామన్నారు. రానున్న రోజుల్లో వైసిపిని వ్యతిరేకించే ఏ పార్టీతో నైనా కలిసే పనిచేస్తామని తెలిపారు. సిపిఎం నాయ కులు జి.బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ మండలి ఎన్నికల్లో అంబోతులు కన్నా దారుణంగా వైసిపి నాయకులు వ్యవహరించారన్నారు. పోలీసులు ఏకపక్షంగా అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలికారని విమర్శించారు. పోలీసులు చట్టప్రకారం వ్యవహరించాలని సూచించారు. లేని పక్షంలో ప్రజా వ్యతిరేకతను రుచి చూస్తారని హెచ్చరిం చారు. టిడిపి మాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ మాట్లాడుతూ తిరుపతిలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ జరిపించాలన్నారు. కేవలం రెండు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్‌ను కంటితుడుపు చర్యగా చేస్తున్నారన్నారు. తిరుపతిలో 7వేల దొంగ ఓట్లు వైసిపి చేర్పించిందన్నారు. దీనిపై ఆధా రాలతో ఎన్నికల రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యమని ఆవేదన వ్యక్తం చేశారు. రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షులు పి. అంజయ్య మాట్లాడుతూ పెద్దల సభకు జరిగిన ఎన్నికలను వైసిపి అపహస్యం చేసిందన్నారు. దౌర్జన్యంతో ఎన్నికల్లో గెలవాలని సిఎం జగన్ చూస్తున్నారన్నారు. రానున్న జనరల్ ఎన్నికల్లో వైసిపి ప్రజలు బుద్దిచెప్పడం ఖాయమ న్నారు. కాంగ్రెస్ నాయకులు మాంగటి గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ అన్యాయాలు, అక్రమాలకు నిలయంగా మారిన ప్రస్తుత ఎంఎల్‌సి ఎన్నికలను రద్దు చేయాలని డిమాండు చేశారు. దొంగ సర్టిఫికెట్లపై విచారణ జరిపి మరోసారి పారదర్శకంగా ఎన్నికలను నిర్వహించాలని కోరారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు వూకా విజయ్ కుమార్, సిపిఐ నాయకులు మురళీ, చిన్నం పెంచులయ్య, రాధాకృష్ణ, విశ్వనాథ్, తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో అఖిలపక్షం నాయకులు

స్ట్రాంగ్‌రూముల్లో భద్రత నడుమ

బ్యాలెట్ బాక్సుల్లో ఫలితాలు భద్రం

● కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి ● ఉపాధ్యాయ ఫలితం 16 సాయంత్రానికి ● పట్టభద్రుల ఫలితం రెండు మూడు రోజుల్లో..

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్

తూర్పు రాయలసీమ నియోజకవర్గ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎంఎల్‌సి అభ్యర్థుల భవిష్యత్‌ను తేల్చే ఓట్లు చిత్తూరు - తిరుపతి జాతీయ రహదారిపై ఉన్న ఎస్వీ సెట్ ఇంజనీరింగ్, లా కళాశాలల్లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లకు చేరుకున్నాయి. బ్యాలెట్ బాక్సులను జిల్లా రిటర్నింగ్ అధికారి హరినారాయణ, ఎన్నికల ప్రత్యేక అధికారి భాస్కర్, సహాయ ఎన్నికల అధికారి వెంకటేశ్వర్లు సమక్షంలో బ్యాలెట్ బాక్సులకు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్ లకు తరలించారు. రాజకీయ పార్టీల నేతలు, పట్టభద్రులు, ఉపాధ్యాయుల స్థానాలకు పోటీ చేసిన అభ్యర్థుల సమ క్షంలో స్ట్రాంగ్ రూమ్‌లకు సీల్ వేశారు. జిల్లా అధికారుల పర్యవేక్షణలో బ్యాలెట్ బాక్సులను భద్రపర్చారు. బుధవారం సాయంత్రానికి కౌంటింగ్ సిబ్బంది కౌంటింగ్ కేంద్రానికి చేరుకోనున్నారు.

ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల్లో రాజకీయ పార్టీల నేతలు, అభ్యర్థులతో ఉపాధ్యాయ, పట్టభద్రుల కౌంటింగ్‌పై ఎన్నికల ప్రత్యేక అధికారి కాటమనేని భాస్కర్, ఎన్నికల రిటర్నింగ్ అధికారి హరినారాయణ్ సమావేశం నిర్వహించి కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా నిర్వహించేందుకు సహకరించాలని కోరారు. పోలింగ్ సందర్భంగా వచ్చిన సమస్యలపై చర్చించారు.

కౌంటింగ్ ఏర్పాట్లు పూర్తి

ఎస్వీ సెట్ ఇంజనీరింగ్ కళాశాల్లో ఎంఎల్‌సి ఎన్నికల ఓట్ల లెక్కింపు కోసం ఏర్పాట్లు పూర్తి చేశారు. 16వ తేది గురువారం ఉదయం 8 గంటల నుండీ కౌంటింగ్ ప్రారంభం కానుంది. కౌంటింగ్ ఏజెంట్లు ఉదయం ఏడు గంటలకు కౌంటింగ్ కేంద్రం వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది. కౌంటింగ్ ఏజెంట్లకు ఫోటో గుర్తింపు కార్డులు జారీ చేయనున్నారు. గుర్తింపు కార్డులున్న వారిని మాత్రమే కౌంటింగ్ హాల్‌లోకి అనుమతిస్తారు. పట్టభద్రుల ఓట్ల లెక్కింపు 40 టేబుల్స్, ఉపాధ్యాయ ఓట్ల లెక్కింపు 8 టేబుల్స్ ఏర్పాటు చేశారు. పట్టభద్రుల స్థానాల్లో పోటి చేసిన అభ్యర్థుల నుండీ కౌంటింగ్ ఏజెంట్లు 40 మందికి అవకాశం ఇచ్చారు. 16 రౌండ్లు కౌంటింగ్ నిర్వహించనున్నారు. 8 గంటలకోసారి ఏజెంటు షిఫ్టు వారిగా మార్చుకునే అవకాశముంది. ఉపాధ్యాయ కౌంటింగ్ 8 రౌండ్లు గురువారం సాయంత్రానికి పూర్తి అయ్యే అవకాశమున్నట్లు అంచనా వేస్తున్నారు. పట్టభద్రుల కౌంటింగ్‌కు రెండు నుంచి మూడు రోజుల సమయం పట్టే అవకాశమున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు.



స్ట్రాంగ్ రూమ్‌కు చేరిన బ్యాలెట్‌బాక్సులు

229, 233 పోలింగ్ కేంద్రాల్లో..

రీ పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : కలెక్టర్



ప్రజాశక్తి - తిరుపతి టౌన్

ప్రకాశం - నెల్లూరు - చిత్తూరు పట్టభద్రుల నియోజకవర్గ శాసనమండలి ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తిరుపతిలో రెండు పోలింగ్ కేంద్రాల్లో రీ పోలింగ్ 15న బుధవారం ఉదయం 8 నుండి సాయంత్రం 4 గంటల వరకు నిర్వహించడానికి ఏర్పాట్లు పూర్తి చేసినట్లు కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. చిన్నబజారువీధి ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల (229), సత్యనారాయణపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (233)ల్లో రీపోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయినట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు స్లిప్పులు సిద్ధంగా ఉన్నాయని, పట్టభద్రుల ఓటర్లు తప్పనిసరిగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరారు. మంగళవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో స్పెషల్ డిప్యూటి కలెక్టర్లతో , ఎలక్షన్ సెల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పోలింగ్ కేంద్రానికి అవసరమైన సామగ్రి సిద్ధం చేయాలని సాయత్రం 4.00 గంటలకు 229 పోలింగ్ కేంద్రం- ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, చిన్నబజారు వీధి(ఓటర్ల సంఖ్య 579) , 233 పోలింగ్ కేంద్రం - జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, సత్యనారాయణ పురం(ఓటర్ల సంఖ్య 792), పి.ఓ., ఎపిఒ , ఇతరపోలింగ్ సిబ్బంది , మైక్రో అబ్జర్వర్ లు చేరుకొని ఏర్పాట్లు పరిశీలించి 15 న జరిగే రీ పోలింగ్ కు సిద్దం చేసుకోవాలని అన్నారు. మంగళవారం ఆల్ బెండా జోల్ మాత్రల పంపిణీ వుందని , మధ్యాహ్న భోజనం అనంతరం విధిగా పిల్లలకు అందించాల్సి వుందని , ఆ తరువాత పిల్లలను గంట , రెండు గంటల పాటు పరిశీలించి రీపోలింగ్ జరగనున్న పాఠశాలలలో పిల్లలను మధ్యాహ్నం 3 గంటల పైగా ఇంటికి పంపాలని ఆపైన 4.00 గంటలకు ఉపాధ్యాయులు బయోమెట్రిక్ హాజరు పూర్తిచేసి వెళ్ళాక అక్కడ ఏర్పాట్లు చూడాలని తెలిపారు. ఈ రెండు పాఠశాలలకు 15 న సెలవు దినంగా ప్రకటించాలని డి ఇ ఓ ను ఆదేశించారు. తిరుపతిలోని 229 పోలింగ్ కేంద్రానికి సంబం ధించి 28, 36 వార్డులు , 233 పోలింగ్ కేంద్రానికి సంబంధించి 45, 46, 47, 48, 49 వార్డులలో ఆటోల ద్వారా ప్రచారం కల్పించాలని సూచించారు. పట్టభద్రుల ఓటు హక్కు వున్న వారు , 13 న ఉపయోగించుకున్న వారు తప్పని సరిగా తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అన్ని ఏర్పాట్లు చూడాలని అన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటరు స్లిప్ లు అందుబాటులో వుంచనున్నామని తప్పనిసరిగా ఓటరు ఇతర ఏదేని గుర్తింపు కార్డు తెచ్చి ఓటరు స్లిప్ తీసుకోవాలని అన్నారు. పోలింగ్ అనంతరం ఎస్కార్ట్‌తో చిత్తూరు స్ట్రాంగ్ రూమ్ కు బ్యాలెట్ బాక్సులు తరలింపు చేపట్టాలని అన్నారు. స్పెషల్ డిప్యూటి కలెక్టర్లు కోదండరామి రెడ్డి, భాస్కర నాయుడు, ఎఒ జయరాములు, ఎన్నికల తహసిల్దార్ పరమేశ్వర స్వామి, డిటిలు పవన్ , విజయభాస్కర్ ,డి. సెక్షన్ భార్గవి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలైన ఓట్ల శాతం (జిల్లాల వారీగా)


ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో సోమవారం జరిగిన పోలింగ్ అనంతరం పట్టభద్రులు, ఉపాధ్యాయులు వారిగా ఓటర్ల పోలైన శాతాన్ని ఎన్నికల అధికారులు ప్రకటించారు .స్క్రూటినీ అనంతరం పట్టభద్రుల స్థానానికి 70.66 శాతం, ఉపాధ్యా యుల స్థానానికి 89.34 శాతం పోలైన ఓట్లుగా రిటర్నింగ్ అధికారి ఎం.హరినారాయణన్ మంగళవారం సాయంత్రం ప్రకటించారు.

జిల్లాల వారీగా ఉపాధ్యాయుల పోలింగ్ సరళి			
అన్నమయ్య	1932	1728	89.44శాతం
బాపట్ల	1789	1686	94.24శాతం
ప్రకాశం	5,789	5,322	91.93శాతం
చిత్తూరు	3,887	2,108	88.71శాతం
తిరుపతి	6,132	5,280	86.11శాతం
నెల్లూరు	8,165	7,277	89.12శాతం
మొత్తం	**27,694**	**24,741**	**89.34శాతం**

జిల్లాల వారీగా పట్టభద్రుల పోలింగ్ సరళి			
అన్నమయ్య	23,833	16,850	70.69శాతం
బాపట్ల	26,390	19,655	74.48శాతం
ప్రకాశం	82,225	59,835	72.77శాతం
చిత్తూరు	54,152	43,161	79.70శాతం
తిరుపతి	85,570	60,327	70.50శాతం
నెల్లూరు	1,07,635	68,559	63.70శాతం
మొత్తం	**3,79,810**	**2,68,387**	**70.66శాతం**

వామ్మో.. నిమ్మ..!

● మార్కెట్లో కాయ రూ.5-7 ● వేసవి ఆరంభంలోనే ధర అమాంతం



జయంపు నిమ్మ మార్కెట్‌లో నాణ్యమైన నిమ్మకాయలు



మార్కెట్లో నిమ్మకాయలు

ప్రజాశక్తి - బాలాయపల్లి

ఎండలు మండుతున్నాయి.. ఓ గంట బయటకు వెళ్లి వస్తే బుర్ర హీటెక్కుతోంది.. గొంతులోకి ఏదైనా జ్యూస్ తాగితే బాగుండని పిస్తుంది.. నిమ్మకాయను మండు వేసవిలో షరబత్‌లోకి బాగా ఉపయోగిస్తారు. నిమ్మ జ్యూస్ పిండి చక్కెర కలిపి తాగుతారు. మజ్జిగ లోనూ నిమ్మను ఉపయోగిస్తారు. మాంసాహారం తినేవారు నిమ్మరసం పిండుకుని తినడం అలవాటు. సంవత్సరం పొడవునా హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లలో నిత్యం ఉపయోగిస్తారు. ఈ నేపథ్యంలో నిమ్మ ధర అమాంతం పెరిగింది. మార్కెట్లో కాయ రూ.5-7 ధర పలుకుతోంది. నిన్నమొన్నటివరకూ 10 రూపాయలకు మూడు, నాలుగు కాయలు ఇచ్చిన వ్యాపారులు ప్రస్తుతం బాగున్న 'ఎ'గ్రేడ్ ఏడు రూపాయలు, ఓ మాదిరి కాయలను 5 రూపాయలకు అమ్ముతున్నారు. ఏమైనా నిమ్మరైతుకు దిగుబడి బాగుంటే మాత్రం పంట పండినట్లే.

నిమ్మకాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. రోజురోజుకూ ధరలు పెరుగుతున్నాయి. వేసవి సీజన్‌లో నిమ్మకాయల వినియోగం ఎక్కువగా ఉంటుంది. అయితే ప్రస్తుతం నిమ్మకాయల దిగుబడి తగ్గడంతో ధర అమాంతం పెరిగిపోయింది. ఈ ఏడాది వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా నిమ్మ దిగుబడి తగ్గింది. అంతే కాకుండా కరోనాకు ముందు వరకూ నిమ్మతోటలు అధికంగా ఉండేవి. అయితే లాభసాటిగా లేకపోవడంతో రైతులు నిమ్మతోటలను తొలగించి వివిధ పంటలు చేపట్టారు. దీంతో నిమ్మసాగు తగ్గింది. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో ధర పెరిగింది. ఈ నేపథ్యంలో నిమ్మకాయలు సామాన్యుడికి దూరమయ్యే పరిస్థితి నెలకొంది. బహిరంగ మార్కె ట్‌లో గతంలో రూ 10 లకు డజను నిమ్మకాయలు వరకూ ఇచ్చేవారు. ప్రస్తుతం రూ 14 లకు పెద్దవి 2 నుంచి 3 ఇస్తున్నారు. చిన్నవి అయితే 4 ఇస్తున్నారు. అంటే ఒక్కో నిమ్మ కాయ ధర రూ.7ల వరకూ పలుకు తోంది.

ఈ ఏడాది ప్రతికూల వాతావరణంతో నిమ్మ దిగుబడి లేకుండా పోయింది. పూత దశలో వర్షాలు పడడం వల్ల దిగుబడి బాగా తగ్గింది. సీజన్‌లో ఎకరాకు 50 నుంచి 70 డిక్కీ బస్తాలు రావాల్సి ఉంది. 5 నుంచి 10 డిక్కి బస్తాల దిగు బడి రావడమే గగనంగా ఉందని రైతులు వాపోతు న్నారు. బాలాయపల్లి మండలం జయంపు నిమ్మ కాయల మార్కెట్ యార్డులో మంగళవారం కిలో పచ్చి నిమ్మకాయల ధర రూ.80 నుంచి 90 పలికింది. పండు నిమ్మకాయల ధర రూ.50 నుంచి రూ.60లకు విక్ర యించారు. ఎందుకంటే పండు నిమ్మకాయలు గంపల లెక్కన విక్రయిస్తారు. కేజీకి పెద్దవి అయితే 25. చిన్నవి అయితే 30 నుంచి 35 కాయల వరకూ తూగుతాయి. గతంలో కేజీ నిమ్మకాయల ధర రూ.20-30 వరకు ధర పలికేది. ప్రస్తుతం దిగుబడి తగ్గడంతో జయంపు నిమ్మ మార్కెట్ యార్డులోనే కాయ ఒకటి రూ 2.50 నుంచి 3-50 పైసా వరకు వరకూ పలుకుతోంది. బాలాయపల్లి మండల పరిధిలో 10 వేల ఎకరాల వరకు నిమ్మసాగు చేస్తున్నారు. జయంపు మార్కెట్‌కు మండలంలోని హస్తకావేరి, నాయుడు చెరువు కండ్రిగ, కోటంబేడు, సంగవరం, మేల్చూరు, మల్లిమాల, గోట్టి కాడు, పాకపూడి, కోత్తపాళెం, పిగిలాం, నిడిగల్లు, గాజులపల్లి, కరిమన గుంట, కాట్రగుంట, క్రింద, అరిగేపల్లి, అలిమిలి, మన్నూరు, పల్లిపాడు, ఓజిలి మండలం ఆరిమేనపాడు, విండోడు, రాగిపాడు, వినుగుంట నుంచి జయంపు మార్కెట్‌లోకి వస్తాయి. ఇక్కడ నుంచి ఆంధ్రా నుంచి పలు ప్రాంతాలకు కలకత్తా, వారణాసి, గుజరాత్, ఒరిస్సా రాష్ట్రాలకు ఎగుమతి చేస్తుంటారు. దిగుబడి తగ్గడంతో నిమ్మకాయలకు ధర పెరిగింది. వేసవి కావడంతో డిమాండ్ ఎక్కువగా ఉంది.

తగ్గిన దిగుబడి

ఏడాదికి ఎకరాకు 50 నుంచి 60 డిక్కి బస్తాలు దిగుబడి వచ్చేది. వాతావారణం అనుకూలంగా లేక పోవడంతో దిగు బడి బాగా తగ్గింది. దీంతో నిమ్మ మొక్కలకు బూజు తెగులు సోకి ఎండు కొమ్మలు వచ్చి నిమ్మ మొక్కలు ఎండి పోవడంతో తోటలలో కాయ లేకుండా పోయింది. మూడు ఎకరాల్లో సీజనల్‌గా ఎకరాకు 50 నుంచి 60 డిక్కి బస్తాల దిగుబడి వస్తుంది.

వేసవి ఆరంభమే ధరల మోత : సురేష్, నిమ్మ వ్యాపారి, జయంపు మార్కెట్

నిమ్మకాయల ధర వేసవి ఆరంభంలోనే అదురుతోంది. జయంపు మార్కెట్‌లో 4 నిమ్మకాయలు రూ.20లు పలుకుతుంది. హోటళ్లలో చపాతీలు, పరోటాలతో పాటు నిమ్మ ముక్క ఇస్తారు. నాన్ వెజ్ తినేటప్పుడు ప్రధానంగా చికెన్, మటన్ తినేవారు నిమ్మరసాన్ని పిండుకోవడం పరిపాటి. ఇలా నిమ్మకాయలకు ఏడాది పొడవునా మంచి డిమాండ్ ఉంటుంది. అయితే వేసవి కాలంలో మాత్రం ఈ డిమాండ్ తారాస్థాయికి చేరుతుంది. వినియోగం పెరగడం, డిమాండ్‌కు అనుగుణంగా సరఫరా లేకపోవడంతో ఈ సీజన్‌లో ధరలను పెంచుతాము. ఫ్రూట్‌మార్కెట్ ఏరియాల్లో నిమ్మకాయల చిల్లర వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. వేసవి ఆరంభంలోనే చిల్లర వ్యాపారులు నిమ్మ ధరలను భారీగా పెంచేయడం జరుగుతుంది. ఇప్పుడే ఇలా ఉంటే ఏప్రిల్, మే, జూన్‌ల్లో నిమ్మకాయలు ధర ఒక కేజీ 150 నుండి 200 పలకవచ్చు.

ధర ఆశాజనకంగా ఉంది : కరణం రమేష్ నాయుడు, బాలాయపల్లి నిమ్మరైతు




కేజీ నిమ్మకాయలు రూ.80 నుంచి రూ.90ల వరకూ పలుకుతోంది. ధర బాగుంది. తీవ్ర వర్షాభావం వల్ల దిగుబడి తగ్గింది. నిమ్మకాయ ధర పెరిగినా లాభం లేదు. ఎందు కంటే దానికి తగినట్టు దిగుబడి లేదు. గత రెండేళ్లగా ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నాం.

నిమిషం ఆలస్యమైనా 'నో ఎంట్రీ'

● నేటి నుంచి ఇంటర్ పరీక్షలు ● 58,750 మంది విద్యార్థులు హాజరు

ప్రజాశక్తి-తిరుపతి సిటి / గూడూరు / సత్యవేడు



ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు

ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ఈ నెల 15వ తేది బుధవారం నుంచి ఏప్రిల్ 4వ తేది వరకు నిర్వహించనున్నారు. రోజు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటలకు వరకు ఇంటర్ పరీక్షలు జరగనున్నాయి. నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను లోనికి అనుమతించేది లేదని, జిల్లా వ్యాప్తంగా ఈ పరీక్షలకు 58,750 మంది విద్యార్థులు హాజరుకానున్నారని కలెక్టర్‌కె.వెంకటరమణారెడ్డి తెలిపారు. పరీక్ష రాసే విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులను ఉదయం 8.45 గంటలకు పరీక్ష కేంద్రాల్లోనికి అనుమతించనున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద ఇప్పటికే పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష కేంద్రాల సమీపంలో ఎలాంటి జిరాక్స్ సెంటర్లు ఉండరాదు. పరీక్ష కేంద్రాల చుట్టుపక్కల 144 సెక్షన్ అమలు చేయనున్నారు. పరీక్ష సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, తాగునీరు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన చోట్ల బస్సు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని, చిన్న పొరబాట్లు జరగకుండా ఇప్పటికే అధికారులు చర్యలు చేపట్టారు. పిల్లలు ప్రశాంత వాతావరణంలో వచ్చి పరీక్షలను బాగా రాయాలని అధికారులు సూచించారు.

గూడూరులో... ఎస్‌కెఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్, చీఫ్ సూపరింటెండెంట్ ఎన్.కోటేశ్వరరావు, పరీక్షా కేంద్రం డిపార్టుమెంట్ ఆఫీసర్ జి. సాయికిరణ్ మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు. సిసి కెమెరా పర్యవేక్షణలో ప రీక్షలు కట్టుదిట్టంగా జరుగుతాయన్నారు. నిమిషం ఆలస్యమైనా నిబంధనను ఈ ఏడాదినుంచి అమలు చేస్తున్నామని, సకాలంలో సభ్యులు హాజరుకావాలని కోరారు.

సత్యవేడులో.. సిసికెమెరాల నిఘా నీడలో పరీక్షలు జరగనున్నాయని జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ అనీల్‌కుమార్ తెలిపారు. ఇంటర్ పరీక్షలు రాయడానికి 12 గదులను కేటాయించారు. 350 మంది విద్యార్థులు మొదటి సంవత్సరం పరీక్ష రాస్తున్నారని తెలిపారు. తప్పనిసరిగా ఉదయం 8.30కల్లా పరీక్షా ప్రాంగణంలోకి చేరుకోవాలని సూచించారు. డిపార్టుమెంట్ అధికారిగా విజయ్‌కుమార్ వ్యవహరించనున్నారు.

పరిమళించిన మానవత్వం..!



ప్రజాశక్తి-కోట: మండల కేంద్రంలో సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద తహశీల్దారు పద్మావతి పరిశీలించారు. ఈ క్రమంలోనే ఓటు హక్కు వినియోగించుకోవడానికి విచ్చేసిన ఓ మహిళ చంటిబిడ్డతో ఉండగా తహశీల్దారు గుర్తించారు. దీంతో మహిళ నుంచి చంటిబిడ్డను తీసుకుని తల్లి ఓటువేసే వరకు బిడ్డను లాలిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది.

ఘనంగా జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవం



ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు జనసేన పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆ పార్టీ పదో ఆవిర్భావ దినోత్సవాన్ని నాయకులు ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం స్థానిక వివేకానంద రోడ్డులోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మచిలీపట్నంలో జరిగిన ఆవిర్భావ దినోత్సవ సభకు జనసేన పార్టీ నాయకులు బస్సులో తరలివెళ్లారు. మచిలీపట్నం వెళ్లేందుకు వాహనాన్ని సమకూర్చిన జనసేన పార్టీ నాయకులు తారక శ్రీనివాస్, శిరీష రామిశెట్టిలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో జనసేన పార్టీ గూడూరు పట్టణ అధ్యక్షులు ఇంద్రవర్ధన్, గూడూరు మండల అధ్యక్షుడు భాస్కర్, చిల్లకూరు మండలాధ్యక్షుడు జమాల్‌బాషా, కోట, వాకాడు, చిట్టమూరు నాయకులు విష్ణు, అక్బర్, రాజా, వెంకయ్య, కోటి క్రాంతి, వంశీ, అవినాష్, శివ, గని, వాసు, కార్యకర్తలు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

విశ్వచందన్‌రెడ్డిని అభినందించిన గద్దర్



ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని గంధమనేని శివయ్య కృష్ణారెడ్డి భవన్‌లో ఆదివారం జరిగిన బహుజన సాహిత్య అకాడమీ 6వ సౌత్ ఇండియా కాన్ఫరెన్స్‌కు అతిథిగా విచ్చేసిన విశ్వం విద్యా సంస్థల అకడమిక్ డైరెక్టర్ ఎన్.విశ్వచందన్‌రెడ్డిని ముఖ్య అతిథిగా హాజరైన ప్రముఖ కవి, రచయిత, గాయకుడు గద్దర్, బీ.ఎస్.ఏ. జాతీయ అధ్యక్షుడు నల్లా రాధాకృష్ణ ఘనంగా సన్మానించి అభినందించారు.

తమిళనాడు మాజీ ప్రధాన కార్యదర్శి శ్రీసిటీ సందర్శన



ప్రజాశక్తి- వరదయ్యపాలెం: తమిళనాడు రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి పి.రామమోహనరావు మంగళవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి ఆయనకు స్వాగతం పలికి శ్రీసిటీ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సిటీ వేగవంతమైన పురోగతిని ఆయన ప్రశంసించారు. మారుమూల ప్రాంతాల్లో ఇన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసి అనేక మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తుండటం అభినందనీయమని తెలిపారు.

న్యాక్ గ్రేడ్‌పై అప్పీల్‌కు ఎస్వీయూ



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయాన్ని న్యాక్ పీర్ కమిటీ ఈ నెల 7, 8, 9 తేదీల్లో సందర్శించి వివిధ శాఖలను, పరిశోధన, అవస్థాపన సౌకర్యాలను అంచనా వేసింది. అనేక రంగాల్లో ఎస్వీయూ కనబరచిన ప్రతిభను చూసింది. కమిటీ ఇచ్చిన పాయింట్లను , గ్రేడ్‌ను న్యాక్ కార్యాలయం మంగళవారం విడుదల చేసింది. అందులో ఎస్వీయూ 3.25 గ్రేడు సాధించింది. ఈగ్రేడు ప్రకారం విశ్వవిద్యాలయానికి 'ఏ' గ్రేడుకు పరిమితమయ్యే అవకాశం ఉంది. కేవలం 0.01 పాయింట్లు వస్తే 3.26 పాయంట్లతో "ఏ"ప్లస్ గ్రేడ్ జాబితాలో ఉండాలి. కేవలం 0.01 పాయింట్లతో "ఏ"ప్లస్ గ్రేడ్ అందుకోలేకపోవడంతో ఎస్వీయూ అప్పీల్ కు వెళ్లాలని నిర్ణయించినట్లు ఎస్వీయూ ఉపకులపతి ఒక ప్రకటనలో తెలిపారు. న్యాక్ కమిటీ నిర్ణయించిన కొన్ని ప్రామాణికాలపై అభ్యంతరాలు ఉన్నందున క్వాంటిటేటివ్ అసెస్‌మెంట్ విభాగం కింద అప్పీల్ కు వెళుతున్నట్లు విసి తెలిపారు. అప్పీల్ ఫైల్ చేయడం జరిగిందన్నారు. న్యాక్ కమిటీ పర్యటనలో గ్రేడు పాయింట్లు సాధించడంలో కృషిచేసిన అధ్యాపక , అధ్యాపకేతర సిబ్బందికి, పరిశోధక, విద్యార్థులకు వీసీ అభినందనలు తెలిపారు.

తెలుగు పాటకు ఆస్కార్ విశేషం



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తెలుగు సినిమా చరిత్రలో ఎన్నడూలేని విధంగా చిత్రీకరించబడిన ఆర్‌ఆర్‌ఆర్ సినిమాలో ' నాటు నాటు ' పాటకు అంతర్జాతీయ గుర్తింపుగా ఆస్కార్ లభించడం ఎంతో సంతోషంగా ఉందని, ఈ అవార్డుతో తెలుగు సినిమా పరిశ్రమ ఖ్యాతి విశ్వవ్యాప్తంగా గుర్తింపు పొందిందని చిరంజీవి అభిమానులు ఈశ్వర రాయల్ తెలిపారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చిరంజీవి అభిమానులు మాట్లాడుతూ ఇద్దరు సినీ నటుల కుటుంబాలకు చెందిన వారసులు నటించిన ఆర్‌ఆర్‌ఆర్ చిత్రం వివిధ భాషల్లో రిలీజ్ అయ్యి ప్రేక్షకుల ఆదరణ పొందిందన్నారు. ఇంతటి ఘనత సాధించడానికి కారకులైన పాట రాసిన చంద్రబోస్, గేయ రచన కీరవాణికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సాయి, సురేష్, లోకేష్, ఆసిఫ్, సుధీర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు ఆల్బండజోల్ భరోసా





పుత్తూరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు



చిన్నగొట్టిగల్లులో...



పిచ్చాటూరులో..



బుచ్చినాయుడుకండ్రిగలో...



బాలాయపల్లిలో పిల్లలతో మాత్రలను మింగిస్తున్న అధికారులు



దొరవారిసత్రంలో..



తడలో...



పుత్తూరులో...

ప్రజాశక్తి-తిరుపతి రూరల్: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినం- 2023 ను వైద్య ఆరోగ్య శాఖ, రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం కింద మంగళవారం జిల్లాలోని 1 సంవత్సరం నుండి 19 సంవత్స రాల పిల్లలకు అందరికీ మొదటి విడత ఆల్బెండజోల్ మాత్రలు శత శాతం వేయాలని జిల్లా కలెక్టర్ కె వెంకట రమణారెడ్డి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం స్థానిక ఎంజిఎం పాఠశాలలో ఏర్పాటు చేసిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం తర్వాత 1సంవత్సరం నుండి 2 సంవత్సరాల పిల్లలకు ఆల్బెండజోల్ 400ఎంజిలో సగం మాత్ర, 2 సం.నుండి 19 సం.ల వయసు గల పిల్లలకు ఆల్బెండ జోల్ 400 ఎంజి ఒక మాత్ర చప్పరిస్తూ మింగేలా అందించాలని అన్నారు. ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం పిల్లలలో కడుపులోని కొంకి పురుగు, నులిపురుగు, బద్దె పురుగు, గుండ్రని పురుగులను నివారించడం ద్వారా పిల్లల యొక్క ఆరోగ్య వద్ధి పెంపొందించి తద్వారా ఉన్నత పౌరులుగా ఎదగేలా చేయడం అని తెలిపారు. సదరు మందుల పంపిణీ వివరాలను ఎన్ డిడి యాప్ నందు ఆన్లైన్ లో ప్రోఫార్మ మేరకు తప్పని సరిగా నమోదు చేయాల ని అన్నారు. జిల్లాలోని 2,444 అంగన్‌వాడీ కేంద్రాల్లోనూ, ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో వెరసి మొత్తం 2,693లోని పిల్లలు, జూనియర్ కళాశాలలు, ఐటిఐ 158 కళాశాలలు వెరశి మొత్తం 5,295 విద్యాసంస్థల్లో దాదాపు 4 లక్షల మంది పిల్లలకు ఈ మాత్రలు అందించాలన్నారు. 18వ తేదీ లోపు వందశాతం పిల్లలు కవరయ్యేలా చూడాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ తగినంత మందులు బఫర్‌స్టాక్‌తో కలిపి అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. మాత్రలు వేసుకున్న పిల్లల్లో ఏమైనా రియాక్షన్ ఉంటే వెంటనే అగ్గరలోని ఆస్పత్రిలో చికిత్స తీసుకునేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రీహరి, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారిని శాంతకుమారి, డిప్యూ టీ డిఎంహెచ్ఓ అరుణ సులోచన, ఆర్ బిఎస్ కే అధికారి డా. హరినాథ్ , మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ హరికష్ణ, విద్యా శాఖ కోఆర్డి నేటర్ కిషోర్ పాల్గొన్నారు.

ప్రజాశక్తి-బాలాయపల్లి: విద్యార్థులందరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని.. అప్పుడే ఆరోగ్యకరంగా ఉంటారని, పిల్లలందరితో నులిపురుగుల నివారణ మందులు తప్పనిసరిగా మింగించాలని వెంకటగిరి సీడీపీవో షంషాద్ బేగం అన్నారు. మంగళవారం మండలంలోని కయ్యూరు, వెంగమాంబపురం, బాలాయపల్లి గ్రామాల్లోని అంగనవాడీ కేంద్రాలకు ఆల్బండజోల్ మాత్రలను అందించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్ పద్మావతి, అంగనవాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పిచ్చాటూరు: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా డాక్టర్ ఎంఈవో హేమమాలిని, వైద్యాధికారిణి గాయత్రి ఆధ్వర్యంలో పిచ్చా టూరు ఎంపీపీ పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో ఆల్బండజోల్ మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ పిల్లలు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని సూచించారు. పిచ్చాటూరు మండలంలో 2 నుంచి 19 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలు 5,905 మందికి గాను 5,609 మందికి మాత్రలు అందించినట్లు తెలిపారు.సీహెచ్‌వో శివయ్య, ఎంపీహెచ్‌ఎస్ నాగరాజు, శాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుత్తూరు పట్టణం: జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా ఎంఈవో తిరుమలరాజు, సీడీపీవో పద్మజ, వైద్యాధికారులు చైతన్య, కళ్యాణి, హేమభూషణరెడ్డిల ఆధ్వర్యంలో మంగళవారం అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని విద్యార్థులతో నులిపురుగుల నివారణకు మాత్రలను మంగళవారం మింగించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ పర్యవేక్షకులు గీతాంజలి, భారతి, కళావతి, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

దొరవారిసత్రం: ప్రతి విద్యార్థి రక్తహీనతను అధికమించాలంటే ప్రభుత్వం ఆరు మాసాలకు ఓసారి అందిస్తున్న నులిపురుగుల నివారణ కోసం ఆల్బండజోల్ మాత్రలు వేసుకోవాలని వైద్యాధికారి చైతన్య విద్యార్థులకు సూచించారు. మంగళవారం దొరవారిసత్రం పీహెచ్‌సీ పరిధిలో జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని చేపట్టారు.కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు విజయ్ కుమారి అధ్యక్షతన డాక్టర్ దివాకర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆల్బెండజోల్ మందులను విద్యార్థులకు అందజేశారు. హెల్త్ సూపర్వైజర్ సుబ్రహ్మణ్యం, ఏఎన్‌ఎంలు రత్నమ్మ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

చిన్నగొట్టిగల్లు: జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా మంగళవారం విద్యార్థులకు ఆల్బండజోల్ మాత్రలను వైద్యాధికారి డాక్టర్ శశికళ ఆధ్వర్యంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం అనంతరం విద్యార్థులతో మాత్రలను మింగించారు. డాక్టర్ తేజస్వి, సీహెచ్‌వో శేషు కుమారి, హెల్త్ సూపర్వైజర్ వసంతకుమారి, ఏఎన్‌ఎం రాధిక, ఆశ కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకోదండరాముని బ్రహ్మోత్సవాలు విజయవంతం చేద్దాం

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతి శ్రీ కోదండరామాలయంలో మార్చి 20 నుంచి 28 వరకు జరుగనున్న వార్షిక బ్రహ్మోత్సవాలను అన్ని విభాగాల అధికారులు సమిష్టిగా కృషిచేసి విజయవంతం చేయాలని టీటీడీ జేఈవో వీరబ్రహ్మం కోరారు. ఆలయంలో మంగళవారం సాయంత్రం బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ మార్చి 20న ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవాలు ప్రారంభమవుతాయని తెలిపారు. ప్రధానంగా మార్చి 22న ఉగాది ఆస్థానం, 24న గరుడ సేవ, 25న హనుమంత వాహనం జరుగుతాయన్నారు. అలాగే మార్చి 31న శ్రీసీతారాముల కల్యాణం, మార్చి 30 నుంచి ఏప్రిల్ ఒకటో తేదీ వరకు శ్రీరామనవమి ఉత్సవాలు, ఏప్రిల్ 3 నుంచి 5వ తేదీ వరకు తెప్పోత్సవాలు నిర్వహిస్తామన్నారు. ఆలయం వద్ద, వాహన సేవల్లో ఆకట్టుకునేలా కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు. తాగునీరు, మజ్జిగ పంపిణీ చేస్తామన్నారు. సమీక్షలో ఎస్ఈ ఎలక్ట్రికల్ వెంకటేశ్వర్లు, ఆలయ డిప్యూటీ ఈవో నాగరత్న, గోశాల డైరెక్టర్ డా.హరనాథ్ రెడ్డి, డిప్యూటీ ఈవోలు గోవిందరాజన్, లోకనాథం, శాంతి, ఆలయ అర్చకులు ఆనంద కుమార దీక్షితులు పాల్గొన్నారు.

తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ సక్సెస్ : ఈవో



ప్రజాశక్తి - తిరుమల: శ్రీవారి దర్శనానికి విచ్చే సే భక్తులు ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీతో 5 నుండి 10 నిమిషాల వ్యవధిలో గదులు పొందుతున్నట్లు టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం ఆ యన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ తిరుమలలో ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వల్ల గదుల రొటేషన్ పూర్తిగా తగ్గిం దన్నారు. దళారీ వ్యవస్థను నిర్మూలించేందుకు ఈ టెక్నాలజీ చక్కగా ఉపయోగపడుతుందన్నారు. సామాన్య భక్తులు ఎవరైతే గదుల కొరకు పేర్లు రిజిస్ట్రేషన్ సమయంలో ఫేస్ రికగ్నిషన్ చేసుకుంటున్నారో, వారే ఉపవిచారణ కార్యాలయాల్లో గదులు పొంది, ఖాళీ చేసే సమయంలో నేరుగా వెళ్లి ఖాళీ చేస్తేనే కాషన్ డిపాజిట్ రిఫండ్ చేయడం జరుగుతుందన్నారు. ఒకసారి తమ ఆధార్ కార్డుతో గదులు పొందిన భక్తులు మళ్లీ 30 రోజుల తర్వాతే గదులు పొందేం దుకు అవకాశం ఉంటుందన్నారు. మార్చి 1వ తేదీ నుండి 12వ తేదీ వరకు గదుల కేటాయింపు ద్వారా అత్యధికంగా రూ.2.95 కోట్ల రాబడి వచ్చిందని తెలిపారు. అడ్వాన్స్ బుకింగ్, కరెంటు బుకింగ్ లో కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు చెప్పారు. తిరుమలలోని వివిధ ప్రాంతాల్లో వసతి కోసం పేర్ల నమోదు కౌంటర్లను ప్రయోగాత్మకంగా త్వరలో సిఆర్ఓ వద్దకు మార్చనున్నట్లు తెలిపారు. అదేవిధంగా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ -2 లో భక్తులకు అందించే ఉచిత లడ్డులో ఫేస్ రికగ్నిషన్ ద్వారా అక్రమాలను అరికట్టినట్లు తెలిపారు. తద్వారా వ్యక్తి లేకుండా లడ్డు టోకెన్ రాదన్నారు. అంతకుముందు మీడియా ప్రతినిధులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీ వల్ల భక్తులు పొందుతున్న సౌకర్యాలను వివరించారు. ఈ సమావేశంలో సిఇ నాగేశ్వరరావు, ఎస్ ఇ-2 జగదీశ్వర్ రెడ్డి, ఎస్వీబీసీ సిఈవో షణ్ముఖ కుమార్, శ్రీవారి ఆలయ డిప్యూటీ ఈవో రమేష్ బాబు, రిసెప్షన్ డిప్యూటీ ఈవోలు హరింద్రనాథ్, భాస్కర్, ఏఈఓ వెంకటేశ్వర్లు నాయుడు పాల్గొన్నారు.

జీవ రసాయనశాస్త్రంలో పార్థసారథికి డాక్టరేట్ ప్రదానం



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని జీవ రసాయన శాస్త్రపు పరిశోధక విద్యార్థి సి.పార్థసారథి డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ తెలిపారు. జీవ రసాయన శాస్త్రంలోని సీనియర్ ఆచార్యులు సీహెచ్ అప్పారావు పర్యవేక్షణలో 'బయో కెమికల్ స్టడీస్ ఇన్ యాంటీ డయాబెటిక్ యాక్టివిటీ ఆఫ్ క్యూమినిక్ యాసిడ్ ఇన్ ఎస్టీజడ్ ఇన్డ్యూజ్డ్ డయాబెటిక్ రాట్స్' అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు వెల్లడించారు.

అలేఖ్యకు డాక్టరేట్



ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని జీవ రసాయన శాస్త్రపు పరిశోధక విద్యార్థి సగ్గమ్ అలేఖ్యకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ప్రకటనలో తెలిపారు. జీవ రసాయన శాస్త్రంలోని ఆచార్యులు ఓవీఎస్ రెడ్డి మార్గదర్శకత్వంలో ' బయో కెమికల్ స్టడీస్ ఆన్ పెక్టినేజ్ ప్రొడక్షన్ అండ్ ఇట్స్ క్యారెక్టరైజేషన్ ఫ్రమ్ ఏ బ్యాక్టీరియల్ ఐసోలేట్ ' అనే అంశంపై పరిశోధనా గ్రంథాన్ని వర్సిటీకి సమర్పించినట్లు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయ పరిశోధనా జర్నల్స్‌లలో అనేక పరిశోధనా పత్రాలను ప్రచురించినట్లు వివరించారు. సగ్గమ్ అలేఖ్యకు డాక్టరేట్ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, పీడీఎఫ్ స్కాలర్లు, విద్యార్థులు అభినందనలు తెలిపారు.

లారీ ఢీకొని యువకుడి మృతి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పరమేశ్వరమంగళంలోని కేకేసీ కళాశాల వద్ద మంగళవారం సాయంత్రం ద్విచక్రవాహనాన్ని లారీ ఢీకొనడంతో ఓ యువకుడు మృతి చెందాడు. నగరి మండలం చింతలపట్టెడ గ్రామానికి చెందిన ప్రభాకర్‌గా పోలీసులు గుర్తించారు. పుత్తూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విశ్రాంత ఉద్యోగి మృతికి నివాళులు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: కేబీఆర్‌పురం గ్రామానికి చెందిన విశ్రాంత ఉద్యోగి ఏఈ రాజగోపాల్ రాజు గత కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతూ మంగళవారం మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ కేబీఆర్ పురం గ్రామానికి వెళ్లి భౌతికకాయాన్ని సందర్శించారు. పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయనతో పాటు నాయకులు మోహన్‌రాజు, బాలాజీ, గ్రామస్థులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు లుహిత ఎంపిక




ప్రజాశక్తి- పిచ్చాటూరు: వెంగళత్తూరులోని శ్రీ సాయిరాం విద్యాలయకు చెందిన ఏడో తరగతికి విద్యార్థిని సి.లుహిత ఇన్‌స్పైర్ పోటీల్లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పాఠశాల నిర్వాహకులు గంగయ్య, గిరిబాబు తెలిపారు. విజ్ఞాన శాస్త్ర ఉపాధ్యాయుడు వి.శ్రావణ్ కుమార్ సహాయంతో తయారు చేసి జిల్లాలో మొదటి స్థానాన్ని సాధించారని..విద్యార్థి లుహితను అభినందించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలు మళ్లీ నిర్వహించాలి

- టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ వెల్లడి

ప్రజాశక్తి-తిరుపతి టౌన్: ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ నాయకులు చదువు రానివారితో దొంగ ఓట్లు వేయించారని.. నిజమైన పట్టభద్రులు ఓటింగ్‌కు రాలేకపోయారని.. తిరుపతి జిల్లా మొత్తం రీపోలింగ్ నిర్వహించాలని టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్, టీడీపీ తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జి సుగుణమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్‌రెడ్డి ఆదేశాల మేరకు పోలీసులు, ఎన్నికల అధికారులు పనిచేశారని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో వైసీపీ రిగ్గింగ్‌కు పాల్పడిందని ఆరోపించారు. టీడీపీ ఏజెంట్లను భయభ్రాంతులకు గురి చేయడమే కాకుండా ఎదురు తిరిగిన వారిపై దాడులు చేసి గాయపరిచారన్నారు. దొంగ ఓట్లు వేయకుండా అడ్డుకున్న టీడీపీ నేతలను అక్రమంగా అరెస్టు చేశారని వాపోయారు. తిరుపతిలో బుధవారం జరిగే రెండు రీపోలింగ్ కేంద్రాల్లో రిగ్గింగ్‌కు పాల్పడకుండా పోలీసులు, ఎన్నికల అధికారులు కృషి చేయాలని, లేకుంటే ఈ ఎన్నికల్లో వైసీపీ ఓడిపోయినట్టేనని పేర్కొన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు నరసింహ యాదవ్, విజయ్ కుమార్ , శ్రీధర్ వర్మ , పులిగోరు మురళీకష్ణారెడ్డి, టీడీపీ కార్పొరేటర్ మునికష్ణ, బుల్లెట్ రమణర, పుష్పావతి, దంపూరి భాస్కర్ యాదవ్, మునిశేఖర్ రాయల్ పాల్గొన్నారు.

ఓటర్లందరికీ సునీల్‌కుమార్ కృతజ్ఞతలు



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు నియోజకవర్గంలో జరిగిన తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎన్నికలపై టీడీపీ కార్యాలయంలో మంగళవారం నాయకులతో కలసి మాజీ ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ విలేకర్లతో మాట్లాడారు. ఎమ్మెల్సీ పోలింగ్ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు నిర్వహించిన ఆర్డీవోకు, డీఎస్పీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. టీడీపీతోనే భవిష్యత్తు అని నమ్మి అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్‌కు ఓటు వేసేందుకు వచ్చిన ప్రతిఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు కృషి చేసిన నాయకులు, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు శీలం కిరణ్ కుమార్, నెలబల్లి భాస్కర్ రెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య, దువ్వూరు రవీంద్ర రెడ్డి, పతన ఉపాధ్యక్షులు నరసింహులు నాయుడు,మాజీ కౌన్సిలర్లు వాటంబెటి శివకుమార్, ఇస్రాయెల్ కుమార్, నియోజకవర్గ మైనారిటీ అధ్యక్షులు ఎం డి అబ్దుల్ రహీం, ఎస్సీ నాయకులు పెంచలయ్య, కోటేశ్వర రావు, గాయం రమణయ్య,చంద్ర మౌళి, వేల్పుల రమేష్,టీ ఎన్ ఎస్ ఫ్ సభ్యులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా ముత్యాలమ్మ జాతర ప్రారంభం



ప్రజాశక్తి-చిల్లకూరు: చిల్లకూరు మండల పరిధిలోని తూర్పు కనుపూరులో వెలసిన ముత్యాలమ్మ అమ్మవారి జాతర మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. మొదట రోజు అమ్మవారిని బంగారు చీరతో అలంకరించారు. సాయ ంత్రం అర్ధ సింహ వాహన సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. సీఐ దశరథ రామారావు, ఎస్సై గోపాల్ బందోబస్తు ఏర్పాటు చేశారు.